సాక్షి
అనంతపురం
సోమవారం । 20 । మార్చి । 2023



**నేటి 'స్పందన' రద్దు**
ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండడం, అధికారులు ఆ విధుల్లోనే ఉండడంతో సోమవారం కలెక్టరేట్‌లో జరగాల్సిన స్పందనను రద్దు చేసినట్లు డీఆర్‌ఓ తెలిపారు.



**టమాట కిలో రూ.12**
కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.12, కనిష్టంగా రూ.4, సరాసరిన రూ.8 పలికింది. మార్కెట్‌కు 225 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



గరిష్టం/కనిష్టం
34.8°/20.1°

జిల్లా అంతటా ఆదివారం పగటి ఉష్ణోగ్రతలు తగ్గిపోగా.. రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉపరితల ఆవర్తనం కారణంగా ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా వర్షాలు పడ్డాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది.

# పది పరీక్షలకు సన్నద్ధం

**ఏర్పాట్లు షురూ..**
- అధికార యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ
- పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాల కల్పన
- ఈసారి పెరిగిన విద్యార్థుల సంఖ్య

| | |
|---|---|
| జిల్లాలో మండలాలు | 31 |
| పదో తరగతి పరీక్ష కేంద్రాలు | 139 |
| హాజరుకానున్న విద్యార్థులు | 35,305 |



డీఈఓ కార్యాలయం

**రాప్తాడురూరల్:** పదో తరగతి పరీక్షలు రాసే రెగ్యులర్ విద్యార్థుల సంఖ్య ఈసారి భారీగా పెరిగింది. జిల్లాలోని 31 మండలాల పరిధిలో గతంలో 25 వేలమంది ఉండేవారు. ఈసారి 30 వేలమంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. దీనికితోడు ఎప్పుడూ లేనివిధంగా ఫెయిలైన విద్యార్థుల సంఖ్య కూడా భారీగానే ఉంది. వన్ ఫెయిల్డ్ విద్యార్థులు దాదాపు ఐదు వేలమంది ఉన్నారు. మొత్తం మీద రెగ్యులర్, ప్రైవేట్ (ఫెయిల్) విద్యార్థులు కలిపి 35,305 మంది పరీక్షలు రాయనున్నారు. వీరి కోసం 139 సెంటర్లు ఏర్పాటు చేశారు. అనంతపురం నగరంలో ఏటా 25 సెంటర్లు ఉండేవి. ఈసారి ఆ సంఖ్య 32కు పెరిగింది. ఏప్రిల్ మూడో తేదీ పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం విద్యాశాఖ అన్ని ఏర్పాట్లూ చేస్తోంది. ఇప్పటికే చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారుల నియామకం పూర్తయింది. వారికి శిక్షణ కూడా ఇచ్చారు. ఇన్విజిలేటర్ల నియామక ప్రక్రియ జరుగుతోంది. విద్యార్థుల హాల్ టికెట్లను ఆయా పాఠశాలల వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంచారు. హెచ్‌ఎంలు డౌన్‌లోడ్ చేసుకుని సంతకం చేసి విద్యార్థులకు అందజేస్తున్నారు.

**సబ్జెక్టు టీచర్లను నియమించరాదు..**
ప్రభుత్వ, రెసిడెన్షియల్, ఆశ్రమ పాఠశాలలు, మునిసిపల్, యూపీ, ఎయిడెడ్ యూపీ పాఠశాలల్లో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్లు, లాంగ్వేజ్ పండిట్ల సేవలను వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. సబ్జెక్టుల పరీక్షలు జరిగే రోజుల్లో ఆయా సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులకు ఇన్విజిలేషన్ విధులు కేటాయించవద్దని జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశించారు. ఇన్విజిలేషన్ విధులకు పీఈటీలు, క్రాఫ్ట్ టీచర్లు, డ్రాయింగ్, మ్యూజిక్ టీచర్ల సేవలను కూడా వినియోగించుకోనున్నారు. వీరందరి నియామకాలు పూర్తయిన తర్వాత కూడా ఇన్విజిలేటర్ల కొరత ఉంటే సెకండరీ గ్రేడ్ టీచర్లను ప్రాధాన్యత క్రమంలో నియమిస్తారు. ఒకే పాఠశాలలో ఆరుగురు ఎస్జీటీలు పని చేస్తుంటే వారిలో నలుగురిని ఇన్విజిలేషన్ విధులకు నియమించుకోనున్నారు. ఇద్దరు ఉంటే ఒకరిని నియమిస్తారు. సింగిల్ టీచర్ ఉన్న ప్రాథమిక పాఠశాలల నుంచి ఇన్విజిలేషన్ విధులకు నియమించరు.

**'నో ఫోన్' జోన్లుగా కేంద్రాలు..**
పరీక్షల విధుల్లో ఉన్న ఇన్విజిలేటర్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, నాన్ టీచింగ్, ఇతర శాఖల సిబ్బంది (ఏఎస్‌ఎంలు, చీఫ్ సూపరింటెండెంట్లు సహా పోలీసు సిబ్బంది) పరీక్ష కేంద్రాలకు మొబైల్ ఫోన్లు తీసుకురాకూడదు. స్మార్ట్ వాచ్‌లు, డిజిటల్ వాచ్‌లు, కెమెరాలు, బ్లూటూత్ పరికరాలు, ఇయర్ ఫోన్లు, ట్యాబ్‌లు, ల్యాప్‌టాప్‌లు, ఫిట్‌నెస్ ట్రాకర్లు తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించకూడదు. సిబ్బంది, విద్యార్థుల వద్ద పరీక్ష కేంద్ర ప్రాంగణంలో మొబైల్ లేదా ఇతర ఎలక్ట్రానిక్ పరికరం గుర్తిస్తే వెంటనే జప్తు చేయాలి.

**ఇబ్బందులు లేకుండా చర్యలు**



ఏప్రిల్ 3 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నాం. ముఖ్యంగా అన్ని కేంద్రాల్లోనూ ఫర్నీచరు, వెలుతురు ఉండేలా చూస్తున్నాం. అందరూ సమన్వయంతో పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి. విద్యార్థులకు ఏ చిన్న ఇబ్బందీ తలెత్తకుండా పరీక్షకేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. – ఎం.సాయిరాం, డీఈఓ

**ఇన్విజిలేటర్ల నియామకాలు జరుగుతున్నాయి**



పదో తరగతి పరీక్షల నిర్వహణకు సంబంధించి ఇన్విజిలేటర్ల నియామకాలు జరుగుతున్నాయి. ఇప్పటికే డీఓ, సీఎస్‌ల నియామకం పూర్తయింది. వారికి శిక్షణ కూడా ఇచ్చాం. ఇబ్బందులు తలెత్తకుండా అన్ని కేంద్రాల్లోనూ పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం.
– గోవిందునాయక్, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్

## ఉన్నత చదువులకు భరోసా

- 42,115 మందికి 'విద్యా దీవెన'



మెగా చెక్కును విడుదల చేస్తున్న అధికారులు

**అనంతపురం రూరల్:** పేదింటి పిల్లల ఉన్నత చదువులకు 'జగనన్న విద్యా దీవెన పథకం' భరోసానిస్తోందని, బాగా చదువుకుని ప్రయోజకులు కావాలని సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ విశ్వమోహన్‌రెడ్డి, బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూకొఠారి సూచించారు. ఆదివారం నగరంలోని కేఎస్‌ఎన్ మహిళా డిగ్రీ కళాశాలలో 'జగనన్న విద్యా దీవెన' నగదు జమ కార్యక్రమం నిర్వహించారు. సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విశ్వమోహన్‌రెడ్డి మాట్లాడుతూ పేద, మధ్య తరగతి విద్యార్థులు ఉన్నత చదువులు పూర్తి చేసేందుకు ఆర్థిక ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న విద్యా దీవెన' పథకం అమలు చేస్తోందన్నారు. జిల్లాలో 42,115 మంది విద్యార్థులకు గాను 38,268 మంది తల్లుల ఖాతాల్లోకి రూ.28.25 కోట్లు నగదు జమ అయిందన్నారు. ఇందుకు సంబంధించిన మెగా చెక్కును అధికారులు విడుదల చేశారు.

## దరఖాస్తుల పరిశీలన

**అనంతపురం:** సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో బోధన పోస్టులు భర్తీ చేస్తున్నారు. బోధన ,బోధనేతర ఉద్యోగాల భర్తీకి గతేడాది డిసెంబర్‌లో నోటిఫికేషన్ ఇచ్చారు. మార్పు చేర్పులతో బోధన పోస్టుల భర్తీకి రీ నోటిఫికేషన్‌ను గత నెల 23న విడుదల చేశారు. దరఖాస్తుల గడువు ఈ నెల 15న ముగిసింది. దరఖాస్తుల పరిశీలనకు కమిటీలు నియమించారు. దరఖాస్తులు పరిశీలన పూర్తయ్యాక పోస్టుల భర్తీ ప్రక్రియ షెడ్యూల్‌ను విడుదల చేయనున్నారు.

## న్యూస్‌రీల్

### విద్యుత్ శాఖకు రూ.5లక్షల నష్టం



బోరంపల్లి ఎస్సీ కాలనీలో నేలను తాకిన వైర్లు

**అనంతపురం టౌన్:** ఇటీవల ఈదురుగాలులతో జిల్లా వ్యాప్తంగా విద్యుత్ శాఖకు రూ.5లక్షల మేర నష్టం వాటిల్లిందని ఎస్‌ఈ సురేంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శింగనమల నియోజకవర్గం పరిధిలోని శింగనమల, నార్పలతోపాటు తాడిపత్రి డివిజన్ పరిధిలో 33 కేవీ విద్యుత్ స్తంభాలు 25, 11కేవీ స్తంభాలు 74, ఎల్‌టీ లైన్ స్తంభాలు 39, రెండు ట్రాన్స్‌ఫార్మర్లు పూర్తి స్థాయిలో దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. స్తంభాలు దెబ్బతిన్న ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి విద్యుత్ సరఫరా పునరుద్ధరించినట్లు తెలిపారు.

### డ్యాన్స్ పోటీల్లో 'ఎస్కేయూ'కు ప్రథమ స్థానం




డ్యాన్స్ పోటీల్లో పాల్గొన్న ఎస్కేయూ విద్యార్థులు

**కళ్యాణదుర్గం:** బెంగళూరులో జరుగుతున్న ఎన్‌ఎస్‌ఎస్ జాతీయ సమైక్యత శిబిరంలో జరిగిన డ్యాన్స్ పోటీల్లో ఏపీ తరఫున ప్రాతినిధ్యం వహించిన ఎస్కేయూ విద్యార్థులు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ మేరకు ఆ బృందానికి ఇన్‌చార్జ్‌గా వెళ్లిన కళ్యాణదుర్గం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి.ఎల్.కాంతారావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా దాదాపు 12 విశ్వవిద్యాలయాల నుంచి వచ్చిన విద్యార్థుల బృందాలు ఈ పోటీల్లో పాల్గొనగా.. ఎస్కేయూ విద్యార్థులు అన్నింటా ప్రతిభ చాటుకుని ప్రథమస్థానంలో నిలిచారు. ఇందులో పెనుకొండ ప్రభుత్వ డిగ్రీకళాశాలకు చెందిన సుస్మిత, హిందూపురం బాలయేసు కళాశాలకు చెందిన భార్గవి, సప్తగిరి కళాశాలకు చెందిన నరేష్, అనంతపురం ఎస్‌ఎస్‌బీఎన్ విద్యార్థి సాయికుమార్, ఎస్కేయూ విద్యార్థి అఫ్రోజ్ ఉన్నారు.

### రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా విజేత 'అనంత'



విజేత ట్రోఫీని అందుకుంటున్న అనంతపురం బాలికల జట్టు

**ఉరవకొండ:** కర్నూలు జిల్లా నందికొట్కూరు వేదికగా జరిగిన 33వ రాష్ట్ర స్థాయి బాల, బాలికల సెపక్‌తక్రా పోటీల్లో అనంతపురం బాలికల జట్టు విజేతగా నిలిచింది. క్వార్టర్స్ మ్యాచ్‌లో శ్రీకాకుళంపై, సెమీఫైనల్స్‌లో ప్రకాశం జిల్లాపై వరుస విజయాలు నమోదు చేసిన అనంతపురం బాలికల జట్టు ఫైనల్‌లో కర్నూలు జిల్లా జట్టుపై తలపడింది. మొదటి సెట్‌లో కాస్త తడబడి 19–21 పాయింట్లు సాధించగా.. రెండో సెట్‌లో 21–15 పాయింట్లు, మూడో సెట్‌లో 21–17 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. ఈ సందర్భంగా విజేతలను అభినందిస్తూ ట్రోఫీని కర్నూలు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి జగదీష్, జూడో రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్, సెపక్‌తక్రా రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు అందజేశారు. రాష్ట్ర స్థాయిలో తొలిసారి జిల్లా జట్టును విజేతగా నిలిపిన క్రీడాకారులను ఆ క్రీడా విభాగం జిల్లా చైర్మన్ సప్తగిరిమల్లి, అధ్యక్షుడు షాహీన్, కోచ్‌లు నాగేంద్ర, వన్నూర్‌స్వామి, ఎర్రిస్వామి, పీడీ మారుతీప్రసాద్ అభినందించారు.

### బైక్‌ల రిపేరీపై ఉచిత శిక్షణ

**అనంతపురం:** రూడ్‌సెట్ సంస్థలో ఈ నెల 23వ తేదీ నుంచి టూవీలర్, మోటార్ రీవైండింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు రూడ్‌సెట్ డైరెక్టర్ ఆర్.లోక్‌నాథరెడ్డి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి జిల్లాకు చెందిన 19 నుంచి 45 సంవత్సరాల్లోపు వయసున్న నిరుద్యోగ యువకులు అర్హులు. ఉచిత శిక్షణతో పాటు భోజన సదుపాయాలు కల్పిస్తారు. ఆసక్తి ఉన్న వారు ఆధార్, రేషన్‌కార్డు నకళ్లతో కూడిన దరఖాస్తును రూడ్‌సెట్ సంస్థలో అందజేసి, పేర్లు నమోదు చేసుకోవాలి. పూర్తి సమాచారానికి 08554–255925, 94925 83484, 96188 76060లో సంప్రదించవచ్చు.

## కస్టడీకి 'హవాలా' దోపిడీ ముఠా



హవాలా సొమ్ము దోపిడీ ముఠా సభ్యుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ ఫక్కీరప్ప (ఫైల్)

- రంగంలోకి సీఐఎస్ బృందం
- ఉగ్రవాద సంస్థలతో సంబంధాలపై ఆరా
- శ్రీధరన్ కోసం గాలింపు

**అనంతపురం శ్రీకంఠంసర్కిల్:** రిమాండ్‌లో ఉన్న హవాలా సొమ్ము దోపిడీ ముఠాకు చెందిన నలుగురు సభ్యులను అనంతపురం పోలీసులు విచారణ నిమిత్తం తమ కస్టడీకి తీసుకున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో 44వ జాతీయ రహదారి మీదుగా తరలుతున్న 'హవాలా' సొమ్ము రాప్తాడు సమీపంలోని హంపాపురం వద్ద దారి దోపిడీకి గురైంది. 'హవాలా' దోపిడీల్లో ఆరితేరిన కేరళ శ్రీధరన్ నేతృత్వంలోని గ్యాంగ్‌ల పనే ఇది అని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ఆ దిశగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. శ్రీధరన్ నేతృత్వంలోని ఒక ముఠా సభ్యులైన కేరళ రాష్ట్రం ఎర్నాకులం జిల్లా ఆలువ వెస్ట్ గ్రామానికి చెందిన కొలపురం బిల్ అబు నిషాద్, కొట్టాయం జిల్లా చెంగానచేపూర్‌కు చెందిన జాక్సన్ ఫిలిప్, అలప్పుజ జిల్లా వేలంకులంగరకు చెందిన కన్నన్ రియాగు, కాలికట్ జిల్లా వడకర గ్రామానికి చెందిన ఓతవాత్ షమీంలను మార్చి పదో తేదీన అరెస్టు చేశారు. అయితే కీలక నిందితుడు శ్రీధరన్‌తో పాటు మరికొంతమంది సభ్యులు పోలీసుల కళ్లుగప్పి తప్పించుకున్నారు. ఈ ముఠా ఆట కట్టించాలని ఎస్పీ ఫక్కీరప్ప రంగం సిద్ధం చేశారు. అందులో భాగంగా కేరళ ముఠాను పట్టుకునేందుకు ఇంతకుమునుపు వెళ్లిన బృందాలను తిరిగి రంగంలోకి దింపాలని చూస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం సాయంత్రం ఎస్పీ సంబంధిత అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో ఈ ముఠాల కదలికను గుర్తించాలని ఆదేశించారు. ఏ చిన్న ఆధారం లభించినా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిసింది. హవాలా డబ్బును చాకచక్యంగా దోచుకుపోతున్న ముఠా వివరాలను ఇప్పటి దాకా పట్టుబడిన నలుగురు నిందితుల ద్వారా రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నారు.

**ఉగ్రవాద సంస్థలతో సంబంధాల కోణంలోనూ విచారణ..**
రాప్తాడు సమీపంలో జరిగిన దారి దోపిడీ ముఠా కోసం గాలిస్తున్న అనంత పోలీసులకు రూ.1.89 కోట్ల హవాలా డబ్బు తీసుకెళ్తున్న మరో ముఠా పట్టుబడింది. ఈ ముఠా నుంచి కూడా డబ్బు దోచుకెళ్లాలని వచ్చిన శ్రీధరన్ ముఠాను 'అనంత' పోలీసులు పట్టుకున్నారు. కాగా హవాలా డబ్బు తీసుకెళుతున్న ముఠాతో పాటు ఆ డబ్బును దోచుకెళ్లేందుకు వచ్చిన ముఠా రెండూ పట్టుబడటంతో పోలీసులు దర్యాప్తును మరింత లోతుగా చేపట్టారు. కాగా రూ.1.89 కోట్ల హవాలా డబ్బు తీసుకెళ్తున్న వారు తమిళనాడు, కోయంబత్తూరుకు చెందిన వారు కావడంతో సీఐసీ (సెంట్రల్ ఇంటెలిజెన్స్ సెల్) అధికారుల బృందం అనంతపురం చేరుకుంది. రెండు నెలల క్రితం కోయంబత్తూరులో పేలుళ్లు జరిగాయి. ఈ ఘటనలో హవాలా ముఠాలకు ఏమైనా హస్తం ఉందా? కేరళ శ్రీధరన్ ఎవరు? హవాలా డబ్బు సమాచారాన్ని ఎలా సేకరిస్తున్నారు? ఈ సొమ్ము ఎక్కడికి పంపుతున్నారు? ఉగ్రవాద సంస్థలతో ఏమైనా సంబంధాలు ఉన్నాయా? అన్న కోణంలో లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యుదాఘాతంతో ప్రైవేట్ కార్మికుడి మృతి

**తాడిపత్రి:** విద్యుత్ శాఖలో ప్రైవేట్ కార్మికుడిగా పని చేస్తున్న ఓ యువకుడు పని ప్రాంతంలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. తాడిపత్రిలోని విజయనగర కాలనీ నివాసి తిరుమలనాయక్ (28) విద్యుత్ శాఖలో ప్రైవేట్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. లైన్‌మెన్‌ను అనుసరిస్తూ పనుల్లో పాల్గొనేవాడు. ఆదివారం ఉదయం అక్కన్నపల్లిలో విద్యుత్ వైర్ల మరమ్మతు పనులకు సిద్ధమయ్యాడు. సబ్ స్టేషన్ నుంచి ఎల్‌సీ తీసుకుని స్తంభం ఎక్కి మరమ్మతు చేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ ప్రసారం జరిగి షాక్‌కు గురయ్యాడు. స్తంభంపై నుంచి కిందపడి అపస్మారక స్థితికి చేరుకున్న తిరుమలనాయక్‌ను స్థానికులు తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే తిరుమలనాయక్ మృతి చెందినట్లు నిర్ధారించారు. సబ్ స్టేషన్ ఉద్యోగి అజాగ్రత్తతోనే విద్యుత్ ప్రసారం జరిగినట్లుగా తెలుస్తోంది.

## 'రిజిస్ట్రేషన్'లో ఇక డిజిటల్ సేవలు!

- కార్యాలయాల్లో రికార్డుల డిజిటలైజేషన్ పూర్తి
- ఉమ్మడి జిల్లాలో 14 కార్యాలయాలు డిజిటల్
- ఏప్రిల్ నుంచి అందుబాటులోకి ఆన్‌లైన్ సేవలు



జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

**అనంతపురం టౌన్:** రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఏప్రిల్ నుంచి డిజిటల్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇదివరకు భూముల రికార్డుల వివరాలు కావాలంటే రోజులు తరబడి నిరీక్షించాల్సి వచ్చేది. ఇకపై అంత సమయం వేచి ఉండక్కర్లేదు. రిజిస్ట్రేషన్ సేవలను వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రికార్డుల డిజిటలైజేషన్‌కు శ్రీకారం చుట్టింది. డిజిటల్ సేవలు అందుబాటులోకి వస్తే వినియోగదారులు ఏ రికార్డు కావాలో ఆ రికార్డు కోసం ప్రభుత్వం నిర్దేశించిన రుసుము చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే గంటల వ్యవధిలోనే పొందే అవకాశం ఉంటుంది.

**14 కార్యాలయాల్లో డిజిటలైజేషన్ పూర్తి**
ఉమ్మడి అనంతపురంలో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాల కింద 21 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఇందులో ఇప్పటికే 14 కార్యాలయాల్లో రికార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. అనంతపురం జిల్లా రిజిస్ట్రార్ పరిధిలో 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలుంటే.. వీటిలో ఇప్పటికే తొమ్మిది కార్యాలయాల్లో డిజిటలైజేషన్ పూర్తయ్యింది. శ్రీ సత్యసాయి జిల్లాలో తొమ్మిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు గాను ఐదింటిలో డిజిటలైజేషన్ పూర్తి చేశారు. మిగిలిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మార్చి ఆఖరులోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

**రామ్‌నగర్ కార్యాలయంలో 100 శాతం పూర్తి**
జిల్లా రిజిస్ట్రార్ ప్రధాన కార్యాలయం ఉన్న అనంతపురం రామ్‌నగర్‌లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రికార్డుల (మ్యానువల్ ఈసీ, ఆర్‌హెచ్ పేజీ, డాక్యుమెంట్ నకల్ కాపీలు) డిజిటలైజేషన్ ప్రక్రియ ఇప్పటికే 100 శాతం పూర్తి చేశారు. వీటితోపాటు ప్రస్తుతం వేలిముద్రల డిజిటల్ ప్రక్రియ చేపడుతున్నారు. నెలాఖరులోపు వేలిముద్రల డిజిటలైజేషన్ కార్యక్రమాన్ని పూర్తి చేయనున్నారు.

**వచ్చే నెలలో అందుబాటులోకి..**



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రికార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతంగా చేపడుతున్నాం. 21 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోని 25 వేలకుపైగా వాల్యూమ్స్‌ను డిజిటల్ చేస్తున్నారు. కొన్ని కార్యాలయాల్లో 100 శాతం డిజిటలైజేషన్ పూర్తయ్యింది. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే.. వచ్చే నెలలో దశల వారీగా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో డిజిటల్ సేవలు అందుబాటులోకి తీసుకురానున్నాం.
– మాధవి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ, డీఐజీ

## బురద చల్లేందుకే అల్లరి

- డిక్లరేషన్ ఇవ్వలేదని అర్ధరాత్రి టీడీపీ నాయకుల యాగీ
- అరెస్టులకు దారితీసే వరకూ కావాలనే బైఠాయింపు
- పక్కా ప్రణాళికతో హల్‌చల్

**సాక్షి ప్రతినిధి, అనంతపురం:** 'మేము ముందు బురద చల్లుతాం.. తర్వాత మీరు కడుక్కుంటూ ఉండండి..' –ఇదీ టీడీపీ నాయకుల వ్యవహారశైలి. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ అనంతరం వారు మరింత దిగజారి వ్యవహరించారని జనంలో చర్చ సాగుతోంది. కౌంటింగ్ ముగిసి పది నిమిషాలు కూడా గడవక ముందే తమ అభ్యర్థి గెలిచినట్లు డిక్లరేషన్ పత్రం ఇవ్వలేదంటూ జేఎన్‌టీయూ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రం వద్ద నానా యాగీ చేశారు. ప్రభుత్వం ఏదో చేస్తోంది.. తమకేదో అయిపోతోందన్న రీతిలో వారు అల్లరి చేసిన తీరు దిగజారుడుతనానికి అద్దం పట్టిందని పలువురు విమర్శిస్తున్నారు.

**ప్రొసీజర్ తెలిసినా..**
ఏ ఎన్నికల ఫలితాలైనా ఎలక్షన్ కమిషన్ అనుమతితోనే ధ్రువీకరిస్తారు. ఎన్నికల కమిషన్ ఓకే అంటేనే గెలిచిన అభ్యర్థికి డిక్లరేషన్ అందజేస్తారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల విషయంలోనూ ఇదే వర్తిస్తుంది. కౌంటింగ్ ప్రక్రియ ముగిసిన వెంటనే రిటర్నింగ్ అధికారి హోదాలో కలెక్టర్.. ఎన్నికల కమిషన్‌కు ఈ–మెయిల్ పంపించారు. అక్కడి నుంచి అనుమతి రాగానే డిక్లరేషన్ ఇస్తామని టీడీపీ నాయకులకు చెప్పారు. అయినప్పటికీ వారు ప్రభుత్వం, అధికార పార్టీపై బురదజల్లే ఉద్దేశంతో శనివారం అర్ధరాత్రి ధర్నాకు దిగారు. హంగామా చేస్తూ అరెస్టులకు దారితీసే పరిస్థితులు సృష్టించారు.

**వైఎస్సార్‌సీపీ అభ్యర్థికీ మరుసటి రోజే డిక్లరేషన్..**
టీచర్స్ ఎమ్మెల్సీగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రామచంద్రారెడ్డి విజయం సాధించారు. ఈ ఫలితాలు ఈ నెల 16వ తేదీ అర్ధరాత్రి వచ్చాయి. ఈసీ అనుమతికి పంపించామని, మరుసటి రోజు డిక్లరేషన్ ఇస్తామని ఆర్‌ఓ చెప్పడంతో ఆయన కిమ్మనకుండా వెళ్లిపోయారు. టీడీపీ నాయకులకూ ఇదే విషయాన్ని చెప్పినా వినకుండా కౌంటింగ్ కేంద్రం వద్ద అనవసరంగా రచ్చ చేశారు.

**చంద్రబాబు ట్వీట్‌పైనా విమర్శలు..**
పద్నాలుగేళ్లు ముఖ్యమంత్రి అని చెప్పుకునే చంద్రబాబు డిక్లరేషన్ విషయమై ప్రజలను తప్పుదోవ పట్టించేరీతిలో ముఖ్యమంత్రిని దూషిస్తూ ట్వీట్ చేయడంపైనా విమర్శలొచ్చాయి. దీన్నిబట్టే ఎంతగా దిగజారి ప్రవర్తించి ఉంటారో అంచనా వేయొచ్చని ఒక పోలీసు అధికారి వ్యాఖ్యానించారు. ఈ విషయంలో పచ్చ మీడియా సైతం టీడీపీ నాయకులకు వంత పాడింది. కాలవ శ్రీనివాసులు, పరిటాల సునీత వంటి వారు కౌంటింగ్ కేంద్రం వద్దే బైఠాయించడం, ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని కాలవ అసత్య ఆరోపణలు చేయడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానించారు. డిక్లరేషన్ అనేది ఎన్నికల కమిషన్ అనుమతితోనే అధికారులు ఇస్తారన్న కనీస ఇంగిత జ్ఞానం టీడీపీ నాయకులకు లేకపోయిందని ఓ సీనియర్ రాజకీయ నేత విమర్శించారు.

## జిల్లాలో పంటనష్టం రూ.30 కోట్లు!

- వడగండ్ల వాన, ఈదురుగాలులకు దెబ్బతిన్న వ్యవసాయ, ఉద్యానపంటలు

**అనంతపురం అగ్రికల్చర్:** జిల్లా వ్యాప్తంగా గత రెండు రోజులుగా వడగండ్లవాన, ఈదురుగాలులకు రూ.30 కోట్ల మేర పంటనష్టం వాటిల్లినట్లు వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఉరవకొండ, కూడేరు, అనంతపురం, గార్లదిన్నె, గుంతకల్లు, శింగనమల, బుక్కరాయసముద్రం, నార్పల, పుట్లూరు, యల్లనూరు మండలాల పరిధిలో 30 గ్రామాల్లో 877 మంది రైతులకు చెందిన 1,169 హెక్టార్లలో అరటి, చీనీ, మామిడి, కర్బూజ, కళింగర, బెండ, మునగ, బొప్పాయి తదితర ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. ఇక పుట్లూరు, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, పెద్దవడుగూరు, శింగనమల, అనంతపురం, గుంతకల్లు, తాడిపత్రి, పామిడి, నార్పల, యల్లనూరు మండలాల పరిధిలో 37 గ్రామాల్లో 2,453 హెక్టార్లలో మొక్కజొన్న, వేరుశనగ, ఆముదం, కొర్ర, జొన్న తదితర వ్యవసాయ పంటలకు నష్టం వాటిల్లింది. పంట నష్టం అంచనాలు సోమవారం కూడా కొనసాగిస్తామని అధికారులు తెలిపారు.

**20 మండలాల్లో వర్షం:** ఉపరితల ఆవర్తన ప్రభావంతో మూడు రోజులుగా జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు 20 మండలాల పరిధిలో 9 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. పామిడి 46.2 మి.మీ, గార్లదిన్నె 44, శింగనమల 37, యల్లనూరు 23.4, పుట్లూరు 22.6, పెద్దవడుగూరు 18.2, వజ్రకరూరు 16.6, కళ్యాణదుర్గం 11.2 మి.మీ నమోదు కాగా.. గుంతకల్లు, బెళుగుప్ప, కూడేరు, పెద్దపప్పూరు, యాడికి, గుత్తి, ఆత్మకూరు, అనంతపురం, నార్పల, శెట్టూరు, తాడిపత్రి, బుక్కరాయసముద్రం తదితర మండలాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షం కురిసింది.



గోవిందవాడలో ఈదురుగాలులు, వర్షానికి దెబ్బతిన్న అరటిపంట

## క్లుప్తంగా

### డిక్లరేషన్ అందుకున్న రామగోపాల్‌రెడ్డి



డిక్లరేషన్ ఫారాన్ని అందజేస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి

**అనంతపురం అర్బన్:** పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైనట్లు డిక్లరేషన్ పత్రాన్ని భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి అందుకున్నారు. ఆదివారం అనంతపురం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆయనకు డిక్లరేషన్ పత్రాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారి హోదాలో కలెక్టర్ నాగలక్ష్మి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన విజయానికి కృషి చేసిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. టీడీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కాలవ శ్రీనివాసులు, బీకే పార్థసారథి, తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా కోర్టు ఆవరణలో నేడు రిలే నిరాహార దీక్ష

**అనంతపురం:** రాయలసీమలో హైకోర్టు ఏర్పాటుకు సంబంధించిన సమగ్ర బిల్లును ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రవేశపెట్టాలనే ప్రధానమైన డిమాండ్ సాధనకు సోమవారం అనంతపురం జిల్లా కోర్టు ఆవరణలో ఒక్క రోజు రిలే నిరాహార దీక్ష చేపట్టనున్నారు. ఈ మేరకు అభివృద్ధి వికేంద్రీకరణ సాధన జేఏసీ కో–కన్వీనర్ సి.హనుమన్న ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అభివృద్ధి వికేంద్రీకరణ సాధన జేఏసీ కన్వీనర్ ఆలూరు రామిరెడ్డి తదితరులు పాల్గొననున్నారు.

# ఊర పిచ్చుక.. ఊరికే అందం



ఒక ఊరిలో పిచ్చుక కనిపిస్తే ఆ ఊరు పచ్చగా ఉన్నట్లు గ్రామీణులు ఓ అంచనా వేస్తుంటారు. పిచ్చుకలు కనిపిస్తున్నాయంటే ఆ ఊరిలో నీటి వనరులు సమృద్ధిగా ఉన్నట్లు.. పంటలు బాగా పండుతున్నట్లు భావిస్తారు. పంట చేలల్లో రైతులను ఇబ్బంది పెట్టే క్రిమికీటకాలను భక్షించి ఎంతో మేలు చేస్తాయి. ఇంట్లో క్రిమికీటకాలు కనిపించాయంటే గుటుక్కున మింగేసి వాటిబారి నుంచి మనల్ని కాపాడతాయి. జీవ వైవిధ్యానికి ప్రతీకగా ఉండే పిచ్చుకల సంఖ్య నేడు గణనీయంగా తగ్గింది. ఈ క్రమంలో పిచ్చుకల జాతి పరిరక్షణకు ప్రపంచ వ్యాప్తంగా 2010 నుంచి ఏటా మార్చి 20న 'ప్రపంచ పిచ్చుకల దినోత్సవం' నిర్వహిస్తూ వాటి మనుగడ ఆవశ్యకతపై ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నారు. ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని పురస్కరించుకుని 'సాక్షి' ప్రత్యేక కథనం.

**దూరమవుతున్న ప్రకృతి నేస్తాలు**

సందర్భం : నేడు ప్రపంచ పిచ్చుకల దినోత్సవం

**అనంతపురం కల్చరల్:** ఒకప్పుడు ఊర పిచ్చుకలు లేని ఊరులేదంటే అతిశయోక్తి కాదు. గ్రామీణ ప్రాంతాల్లో ఏ వాడ చూసినా, ఏ ఇల్లు చూసినా గుంపులు గుంపులుగా ఊరపిచ్చుకలు కనిపించేవి. పిచ్చుకలు, మానవులు ఒకే కుటుంబసభ్యులుగా కలిసి పోయేవారు. గుప్పెడు గింజలు వేస్తే చాలు కలకాలం తోడుండే పిచ్చుకలు వాతావరణంలో మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, రేడియేషన్ టవర్లు, శబ్ద కాలుష్యాల దెబ్బకు ఎక్కడికక్కడ రాలిపోతున్నాయి. దీంతో పర్యావరణాన్ని కాపాడే పిచ్చుకల జాతి సంరక్షణకు ప్రత్యేకంగా నడుం బిగించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

**అంతరించిపోతున్న సంప్రదాయం..**

ఒకప్పుడు ఇంట్లో పిచ్చుకలు గూడు కట్టుకుంటే శుభం జరుగుతుందని భావించి, వాటిని మురిపెంగా పిలుస్తూ ధాన్యాలను వెదజల్లేవారు. మసీదులు, ఆలయాలు, ప్రార్థనా మందిరాల్లో పావురాలు, పిచ్చుకలు యథేచ్ఛగా సంచరించేవి. రోజురోజుకూ పెరిగిపోతున్న మానవుడి స్వార్థం కారణంగా పచ్చని చెట్లు, చల్లటి వాతావరణం నాశమవుతున్నాయి. సెల్‌ఫోన్ టవర్ల రేడియేషన్ కారణంగా పిచ్చుకల జాతి అంతరించిపోతోందని నిపుణులు హెచ్చరిస్తూనే ఉన్నారు. పాతతరం వాళ్లు పాటించిన విధానాలను అనుసరిస్తే కొద్ది వరకూ పిచ్చుకల పరిరక్షణ సాధ్యమవుతుందని అంటున్నారు.

### పిచ్చుకల సంరక్షణకు చర్యలు

నానాటికీ అంతరించిపోతున్న పిచ్చుకల సంరక్షణకు అనంతపురానికి చెందిన సామాజిక కార్యకర్త ఏజీ అనిల్‌కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఇప్పటి వరకూ దాదాపు 68 వేలకు పైగా గూళ్లను సొంతంగా చేయించి ప్రజలకు ఉచితంగా పంపిణీ చేస్తూ పిచ్చుకల మనుగడపై అవగాహన కల్పించారు. ఫలితంగా లక్షకు పైగా పిచ్చుకలు ఈ గూళ్లలో గుడ్లను పొదిగి మరో రెండు లక్షలకు పైగా పిల్లల ఉత్పత్తికి తోడ్పాటునందించినట్లైంది. అంతేకాక పిచ్చుకల కోసం ధాన్యం, నీటిని సమకూర్చే దిశగా చర్యలూ చేపట్టారు. ఏజీ అనిల్‌కుమార్‌రెడ్డి కృషిని గుర్తించిన ఇంగ్లాండ్‌లోని పక్షి ప్రేమికులు ఆయనకు హార్వర్డ్ వరల్డ్ రికార్డుల్లో చోటు కల్పించారు. కాగా, పిచ్చుకలు ఒకేలా కనపడినా వీటిల్లో అనేక రకాలున్నాయి. వెస్పర్, సాంగ్‌స్పారో, గ్రాస్‌హాపర్, చాప్పింగ్, రూస్టస్ స్కెల్డ్, లింకన్స్ స్పారో, షార్ప్‌టైల్డ్, లార్క్, ఫీల్డ్, వైట్ త్రోటెడ్, స్పానిష్, సిండ్ తదితర రకాల పిచ్చుకలు ఉన్నట్లు పక్షి ప్రేమికులు చెబుతున్నారు.

**బతికించుకోవాలి**



పిచ్చుక చిన్నదే అయినా దీన్ని బతికించుకోవాలి. అభివృద్ధి చెందుతున్న సాంకేతిక జీవన విధానం వల్ల పిచ్చుకల సంఖ్య ఏటా తగ్గిపోతోంది. ఎన్నో బంధాలను, ఆత్మీయ నేస్తాలను దూరం చేస్తోంది. పిచ్చుక జాతిని రక్షించుకోకుంటే భవిష్యత్తు తరాలకు పిచ్చుక బొమ్మను చూపించి ఇది పిచ్చుక అనే పక్షి, మన ఇండ్లలోనే తిరిగేదని చెప్పాల్సిన పరిస్థితి వస్తుంది. వీటి పరిరక్షణపై విద్యార్థి దశలోనే అవగాహన కల్పించేలా పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన సదస్సులు, వ్యాసరచన పోటీలు, ర్యాలీలు చేపడితే ఒకింత మంచి ఫలితాలు ఉంటాయి.

– మతం నాగరాజు, పక్షి ప్రేమికుడు


**చైతన్య పరుస్తున్నాం**



నానాటికీ తరిగిపోతున్న పిచ్చుకల సంరక్షణకు ఇప్పటి వరకూ 68 వేల గూళ్లను ఉచితంగా అందజేశాం. ప్రతి ఇంటి ముంగిట ఓ పక్షి గూడు ఉండాలన్నదే మా తపన. పిచ్చుకలకు ఆహారం, నీటి వసతి కల్పించేలా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చాం. మా కృషిని గుర్తించి హార్వర్డ్ వరల్డ్ రికార్డుల్లో చోటు కల్పించడం ఎంతో ఆనందంగా ఉంది.

– ఏజీ అనిల్‌కుమార్‌రెడ్డి, సామాజిక కార్యకర్త, అనంతపురం

### వైఎస్సార్‌సీపీ నేతపై వేట కొడవలితో దాడి



చికిత్స పొందుతున్న వెంకటనారాయణ

**పెద్దపప్పూరు:** పాత కక్షల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నేతపై జేసీ వర్గీయుడు హత్యాయత్నం చేశాడు. పోలీసులు తెలిపిన మేరకు...పెద్దపప్పూరు మండలం వరదాయపల్లి సర్పంచ్ వెంకట్రాముడు సోదరుడు వైఎస్సార్‌సీపీ నేత పిల్లి వెంకటనారాయణ ద్విచక్ర వాహనంపై ఆదివారం రాత్రి 8 గంటలకు ముచ్చుకోట నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. విషయాన్ని తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన జేసీ ప్రభాకరరెడ్డి వర్గీయుడు ఉప్పర శ్రీరాములు ఆటోలో వెంబడిస్తూ వరదాయపల్లి సమీపంలోకి చేరుకోగానే వెనుక నుంచి ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నాడు. ఘటనలో కిందపడిన వెంకటనారాయణపై అనుచరులతో కలసి వేటకొడవలితో దాడికి తెగబడ్డాడు. ఘటనలో గాయపడిన వెంకటనారాయణను స్థానికులు వెంటనే తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న తాడిపత్రి మున్సిపల్ కౌన్సిలర్ కేతిరెడ్డి హర్షవర్ధనరెడ్డి.. ఆస్పత్రికి చేరుకుని క్షతగాత్రుడిని పరామర్శించారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### రేషన్ బియ్యం స్వాధీనం

**గుంతకల్లు రూరల్:** అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. వివరాలను విజిలెన్స్ ఎస్‌ఐ శేషగిరి వెల్లడించారు. అందిన సమాచారం మేరకు శనివారం రాత్రి ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్న సరోజమ్మ ఇంటిని విజిలెన్స్ అధికారులు తనిఖీ చేయగా 17 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడింది. విచారణలో కుమార్ అనే వ్యక్తి రేషన్ బియ్యాన్ని అక్రమంగా దాచినట్లు వెల్లడి కావడంతో అతనిపై కేసు నమోదుకు పోలీసులకు సిఫారసు చేశారు.

# మామిడిలో 'అకాల వర్షాల'యాజమాన్యం

- శ్రీసత్యసాయి జిల్లా ఉద్యానశాఖ అధికారి జి.చంద్రశేఖర్ సూచనలు



**అనంతపురం అగ్రికల్చర్:** ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలు, పెనుగాలుల ప్రభావానికి మామిడి తోటలకు నష్టం వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యాన రైతులకు శ్రీసత్యసాయి జిల్లా ఉద్యానశాఖ అధికారి జి.చంద్రశేఖర్ (79950 86791) సూచించారు. ఉమ్మడి జిల్లా పరిధిలో 40 హెక్టార్ల విస్తీర్ణంలో మామిడి తోటలు ఉండగా, ఈ సారి 4.50 లక్షల మెట్రిక్ టన్నుల మేర దిగుబడులు అంచనా వేసినట్లు పేర్కొన్నారు. మార్కెట్‌లో ధరల పరిస్థితి కూడా ఆశాజనకంగా ఉండడంతో పంటను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలు, పెను గాలుకు కాయలు రాలిపోవడం, కాయలపై మచ్చలు వచ్చి ధరలు తగ్గే పరిస్థితి ఉందని, సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఈ నష్టాన్ని అధిగమించవచ్చునన్నారు. ఎక్కడైనా ఒక సెంటీమీటర్... అంతకన్నా ఎక్కువ వర్షపాతం నమోదైతే సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం మామిడి పూత దశ నుంచి కాయ, మరికొన్ని ప్రాంతాల్లో కోత దశలో ఉన్నాయన్నారు. ఈ వర్షాల వల్ల కాయలు 100 గ్రాములకు పైగా బరువుంటే ఆ కాయ గట్టి పడుతుందన్నారు. చిన్నపాటి కాయలు, పూత ఉన్న తోటల్లో మచ్చతెగులు, బూడిద తెగులు ఆశించే ప్రమాదముందున్నారు. నివారణకు 0.3 మి.లీ ఇమిడాక్లోప్రిడ్ + 1 గ్రాము కార్బండిజమ్ లేదంటే 1 గ్రాము కార్బండిజమ్ + 2.5 గ్రాములు మాంకోజెబ్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. చిన్న పిందెలు, పూత దశలో ఉన్న తోటల్లో మళ్లీ చిగుర్లు వచ్చే అవకాశం ఉందని, లేత చిగుర్లను ఆశించే రసంపీల్చు పురుగులు, వాటితో పాటు వచ్చే తేనెమంచు పురుగు, తామర పురుగుల నివారణకు 0.3 మి.లీ ఇమిడాక్లోప్రిడ్ + 2 మి.లీ ఫిప్రోనిల్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. పెనుగాలులకు రాలిన కాయలను పైపాట్లు తీసేసి చిన్నముక్కలు చేసి ఎండబెట్టి మామిడి పొడి చేసుకుంటే లాభదాయకంగా ఉంటుందన్నారు. ఈ వర్షాలకు కలుపు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



# 6లక్షల మంది కూలీలకు పనులు కల్పించాలి

- డ్వామా పీడీ వేణుగోపాలరెడ్డి

**అనంతపురం టౌన్:** ఈ నెలాఖరు లోపు జిల్లా వ్యాప్తంగా 6 లక్షల మంది కూలీలకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పనులు కల్పించాలని సంబంధిత సిబ్బందిని డ్వామా పీడీ వేణుగోపాలరెడ్డి ఆదేశించారు. ఆదివారం ఆయన ఏపీడీలు, ఏపీఓలతో టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. 2022–23 ఆర్థిక సంవత్సరం ఈ నెలాఖరుతో ముగియనుందన్నారు. ఈ క్రమంలో మరో 6 లక్షల మంది కూలీలకు ఉపాధి పనులు కల్పిస్తే ఉన్నతాధికారులు నిర్దేశించిన లక్ష్యాన్ని చేరవవుతామన్నారు. ఆ దిశగా చర్యలు చేపట్టాలన్నారు. రోజూ 50 వేల మందికి తగ్గకుండా పనులు కల్పించాలన్నారు. ప్రతి మండలం నుంచి 3వేల మంది కూలీలు తప్పనిసరిగా పనుల్లో పాల్గొనేలా చూడాలన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో 1.41 కోట్ల పని దినాలు లక్ష్యంగా నిర్దేశించుకుని నివేదికను ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిపారు. దీంతో పాటు మెటీరియల్ కంపోనెంట్ కింద రూ.230కోట్లకు నివేదికలు అందజేశామన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలతో పాటు వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

# ప్రతిభలో గేట్

- జాతీయ స్థాయిలో 75వ ర్యాంకు సాధించిన మహమ్మద్ ముజామ్మిల్
- 80వ ర్యాంకు దక్కించుకున్న దాసరి నిర్ణీత


**అనంతపురం:** ఇంజినీరింగ్, సైన్స్ కోర్సుల్లో ప్రతిభను గుర్తించేందుకు నిర్వహిస్తున్న గేట్ (గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూట్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్) పరీక్షల్లో అనంతపురం జేఎన్‌టీయూ విద్యార్థులు సత్తా చాటారు. ఈ నెల 16న గేట్ ఫలితాలు విడుదలయ్యాయి. జాతీయ స్థాయిలో లక్షలాది మంది విద్యార్థులు రాసే ఈ పరీక్షలో అత్యుత్తమ ప్రదర్శించి టాప్–100లో జేఎన్‌టీయూ అనంతపురం విద్యార్థులు నిలిచారు. గేట్‌లో ప్రతిభ చాటుకుంటే పబ్లిక్ సెక్టార్ కంపెనీల్లో కొలువులు దక్కడమే కాక, సీఎస్ఐఆర్ స్పాన్సర్డ్ ప్రాజెక్టుల్లో జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అందజేస్తారు. గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్ వంటి కంపెనీల్లో కొలువులు దక్కాలంటే గేట్‌లో అర్హత తప్పనిసరి. ప్రతిష్టాత్మక ఇంజినీరింగ్ కళాశాలలతో పాటు 23 ఐఐటీ కళాశాలల్లో, 31 ఎన్ఐటీ కళాశాలల్లో, ఐఐఎస్‌సీ బెంగళూరు, బిట్స్ పిలానీలో ఎంటెక్ అడ్మిషన్లు దక్కుతాయి. విదేశీ వర్సిటీల్లోనూ అడ్మిషన్లకు గేట్ ఉత్తీర్ణత అనివార్యం.బార్క్ (బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్)లోనూ పరిశోధనకు అవకాశముంటుంది. జేఎన్‌టీయూ (ఏ)కి చెందిన వడ్ల శివకృష్ణ ఆచారి జాతీయ స్థాయిలో 1,112వ ర్యాంకు, జి.సందీప్‌కుమార్ 1,169, ఎం.చిన్న ఎల్లారెడ్డి 2,378, ధరణి సింగమ్ శెట్టి 3,066, శ్రీవైష్ణవి 3,066, షేక్ వసీం 3,300 ర్యాంకులు దక్కించుకున్నారు.

**75వ ర్యాంక్**



జేఎన్‌టీయూ(ఏ)లో మెకానికల్ ఇంజినీరింగ్ కోర్సు పూర్తిచేసిన మహమ్మద్ ముజమ్మిల్ గేట్ జాతీయ స్థాయిలో 75వ ర్యాంకు దక్కించుకున్నారు. మొత్తం 1000 మార్కులకు గాను 827 మార్కులు సాధించారు. 2018–2022లో బీటెక్ పూర్తి చేసి, ప్రస్తుతం ఐఐటీ ముంబయిలో మెకానికల్ ఇంజినీరింగ్‌లో ఎంటెక్ చేస్తున్నారు. నాన్న జి.బాబా ఫకృద్దీన్ ట్రేడింగ్ కార్పొరేషన్ ఇండియా కంపెనీలో డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా, అమ్మ తహసీన్ ఏఈఈ (ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్)గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా మహమ్మద్ ముజమ్మిల్ మాట్లాడుతూ.. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఈ విజయం సాధ్యమైందన్నారు. తరచూ సిలబస్‌ను రివిజన్ చేయడం, మాక్‌టెస్టులు ప్రాక్టీస్ చేయడంతో పోటీ పరీక్ష సులువైందన్నారు. ఐఐటీ ముంబయి ప్రొఫెసర్ సందీప్‌కుమార్ సాహా, అన్ ఎకాడమీ ఎడ్యుకేటర్ స్వప్నకుమార్ మొండాల్ సలహాలు, సూచనలు మంచి మార్కుల సాధనకు దోహదపడినట్లు తెలిపారు. ఇండియన్ ఇంజినీరింగ్ సర్వీసెస్ (ఐఈఎస్) సాధించడమే తన లక్ష్యం అన్నారు.

**80వ ర్యాంక్**



ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాజశేఖర్, గృహిణి విజయలక్ష్మి దంపతుల కుమార్తె నిర్ణీత 2022లో జేఎన్‌టీయూ(ఏ)లో ఇంజినీరింగ్ పూర్తి చేశారు. ఇటీవల గేట్ పరీక్ష రాసి జాతీయ స్థాయిలో 80వ ర్యాంకు సాధించారు. నవరత్న కంపెనీల్లో ఉద్యోగంలో చేరడమే లక్ష్యంగా ఉన్నట్లు ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు.

### చితి మంటలు చుట్టుముట్టి వ్యక్తికి గాయాలు



తీవ్రంగా గాయపడిన తిప్పేస్వామి నాయక్

**ఆత్మకూరు:** దహన సంస్కారాల్లో పాల్గొన్న ఓ వ్యక్తిని చితి మంటలు చుట్టుముట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. బళ్లారి జిల్లా, కూడ్లిగి తాలూకా, చిరుమనెహళ్లికి చెందిన శశికళ (24)కు ఆత్మకూరు మండలం, పంపనూరు తండాకు చెందిన రమేష్ నాయక్‌తో ఈ నెల 12న వివాహమైంది. ఐదు రోజుల తర్వాత ఈ నెల 17న ఆమె ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఆదివారం పంపనూరు తండాలో ఆమె అంత్యక్రియలకు ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న రాయదుర్గం మండలం వీరాపురం గ్రామానికి చెందిన సమీప బంధువు తిప్పేస్వామినాయక్ వచ్చాడు. మృతదేహాన్ని చితిపై పెట్టి నిప్పంటించిన సమయంలో తిప్పేస్వామి నాయక్ పెట్రోల్ చల్లుతూ వచ్చాడు. ఆ సమయంలో మంటలు ఒక్కసారిగా తిప్పేస్వామి నాయక్‌ను చుట్టుముట్టాయి. ఘటనలో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. మంటలు ఆర్పే క్రమంలో మరో ఇద్దరికి గాయాలయ్యాయి. తిప్పేస్వామినాయక్‌ను ఆటోలో అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు క్షతగాత్రుడు స్పందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు.

# హైకోర్టు జడ్జీల పర్యటన విజయవంతం చేద్దాం

- న్యాయవాదుల సమావేశంలో జిల్లా జడ్జి జి.శ్రీనివాస్
- ఎస్పీ ఫక్కీరప్పతో కలసి ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి
- మోడల్‌క్యాంప్ నిర్వహణలో భాగంగా లబ్ధిదారులతో సమావేశం



న్యాయవాదుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీనివాస్

**రాయదుర్గం:** జిల్లా కేంద్రంలో నిర్వహించే మోడల్ క్యాంప్‌ను హైకోర్టు న్యాయమూర్తి డి.రమేష్ ఉత్తర్వుల మేరకు రాయదుర్గానికి మార్చాల్సి వచ్చిందని, ఈ క్రమంలో హైకోర్టు న్యాయమూర్తుల పర్యటనను విజయవంతం చేద్దామంటూ న్యాయవాదులకు జిల్లా జడ్జి జి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. న్యాయ సేవాధికారి సంస్థ జిల్లా కార్యదర్శి దీనబాబు, రాయదుర్గం, కళ్యాణదుర్గం జూనియర్ సివిల్ జడ్జిలు ఎస్.లావణ్య, బి.సుభాన్, ఎస్పీ ఫక్కీరప్ప, కళ్యాణదుర్గం ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి, డీఎస్పీ బి.శ్రీనివాసులుతో కలసి ఆదివారం ఆయన రాయదుర్గంలో పర్యటించారు. ముందుగా దశభుజ గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక కోర్టులో ఏర్పాటు చేసిన న్యాయవాదుల సమావేశంలో పాల్గొని, మాట్లాడారు. ఈ నెల 25న ఐదుగురు సభ్యులుగా ఉన్న హైకోర్టు న్యాయమూర్తుల బృందం రాయదుర్గంలో పర్యటించనుందన్నారు. వీరిలో న్యాయమూర్తి డి.రమేష్ రాయదుర్గంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోనే విద్యాభ్యాసం చేశారని గుర్తు చేశారు. బార్ అసోషియేషన్ సభ్యులు, పోలీస్, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు. అనంతరం హైస్కూల్‌ను సందర్శించి అక్కడ ఏర్పాటు చేయబోయే పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి సంబంధించిన ఏర్పాట్లపై ఆరా తీశారు. అనంతరం మద్దానేశ్వర కల్యాణమంటపంలో మోడల్ క్యాంప్ లబ్ధిదారులతో సమావేశం నిర్వహించేందుకు చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. బసివినీలు, మహిళలు, బాలల హక్కులు, మహిళా సాధికారతపై సమావేశం ఉంటుందన్నారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి 600 నుంచి 700 మంది లబ్ధిదారులు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఈ సందర్భంగా ఆయన ఆదేశించారు.

**త్వరలో పోస్టుల భర్తీ..**

రాష్ట్ర వ్యాప్తంగా న్యాయస్థానాల్లో ఖాళీగా ఉన్న వివిధ పోస్టుల భర్తీకి రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం చర్యలు చేపట్టిందని జిల్లా జడ్జి శ్రీనివాస్ తెలిపారు. ఈ నోటిఫికేషన్‌లోనే జిల్లాకు సంబంధించిన 267 పోస్టులు భర్తీ కానున్నట్లు పేర్కొన్నారు. సిబ్బంది నియామకం పూర్తయితే కేసుల విచారణ వేగవంతమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కోర్టుల్లో ఏడు రకాల ఫర్నీచర్ ఏర్పాటుకు రూ.1.50 కోట్ల నిధులు మంజూరయ్యాని, త్వరలో ఈ ప్రక్రియ కూడా పూర్తిచేస్తామన్నారు. కార్యక్రమంలో రాయదుర్గం రూరల్ సీఐ యుంగధర్, తహసీల్దార్ మారుతి, ఎస్ఐలు సుమన్, దుగ్గిరెడి, రాయదుర్గం, కళ్యాణదుర్గం కోర్టు సిబ్బంది, పోలీస్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### నేడు మెడికల్ కళాశాలలో ఫ్రెషర్స్ డే

**అనంతపురం సప్తగిరి సర్కిల్:** నగరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సోమవారం ఉదయం 10 గంటలకు 2023 బ్యాచ్ విద్యార్థులు ఫ్రెషర్స్‌డే నిర్వహించనున్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం , వైస్ ప్రిన్సిపాల్ షారోన్ సోనియా ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నారు.

### ఖురాన్ పఠనంతో ప్రశాంతత


మాట్లాడుతున్న నగర మేయర్ వసీం

**అనంతపురం సప్తగిరి సర్కిల్:** ఖురాన్ పఠనంతో ప్రశాంత లభిస్తుందని మేయర్ వసీం తెలిపారు. స్థానిక వినాయక నగర్‌లోని మసీద్‌ఏ తౌహీద్‌లో ఏర్పాటు చేసిన ఖురాన్ హాఫిజ్‌ల సన్మాన కార్యక్రమానికి మేయర్, మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్ హాజరయ్యారు. నగర మేయర్ మాట్లాడుతూ రంజాన్‌లో ఖురాన్ పఠించాలని, దాన ధర్మాలు చేయాలని, పేదలను ఆదుకోవాలని, నమాజు చేయాలన్నారు. కార్యక్రమంలో 11వ డివిజన్ కన్వీనర్ మహబూబ్ బాషా, మత పెద్దలు, మౌలానాలు పాల్గొన్నారు.

### నేడు వేలంపాట

**ఆత్మకూరు:** పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో కొబ్బరి చిప్పలు సేకరించే హక్కు కోసం సోమవారం ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం వేయనున్నట్లు ఈఓ అక్కిరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

### సంతల ద్వారా రూ.3.72 లక్షల ఆదాయం

**అనంతపురం అగ్రికల్చర్:** స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఈ వారం జరిగిన జీవాలు, పశువుల సంతల ద్వారా రికార్డు స్థాయిలో రూ.3.72 లక్షలకు పైగా ఫీజు వసూలైనట్లు యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ వై.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత నుంచి రూ.2,12,720 కాగా, ఆదివారం పశువుల సంత ద్వారా రూ.1,59,300 మేర ఆదాయం వచ్చినట్లు తెలిపారు. వచ్చే వారం మధ్యలో ఉగాది పండుగ ఉన్నందున జీవాల సంత ఆదాయం పెరిగిందన్నారు.

### 30న శ్రీరామనవమి పర్వదిన శోభాయాత్ర

**అనంతపురం కల్చరల్:** శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా ఈనెల 30న నగరవీధుల్లో భారీ ఎత్తున శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తోట సూర్య, అశోక్ చక్రవర్తి ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 9 గంటలకు స్థానిక ఎస్ఎస్‌బీఎన్ కళాశాల ప్రాంగణం నుంచి ప్రారంభమవుతుందన్నారు. అయోధ్య రామాలయానికి సంఘీభావంగా హిందూ చైతన్యమే లక్ష్యంగా సాగుతున్న శోభాయాత్రలో అందరూ పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

### 'స్పందన' రద్దు

**అనంతపురం క్రైం:** నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమం ఈ వారం ఉండదని కమిషనర్ రమణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. వచ్చే సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

### పన్ను రూ.21.58 లక్షల వసూలు

**అనంతపురంక్రైం:** నగరపాలక సంస్థ, పాతూరు, రాంనగర్, రెండో రోడ్డు ప్రాంతాల్లో ఆదివారం ఇంటి, నీటి, ఖాళీ జాగా పన్ను రూ.21.58 లక్షలు వసూలైంది. ఒకే సారి పన్ను చెల్లిస్తే ప్రభుత్వం వడ్డీ మాఫీ చేస్తామని జీఓ విడుదల చేసింది. నగరపాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి నగరంలోని సెవెన్ హిల్స్ కాలనీ, అరవిందనగర్‌లో జరుగుతున్న స్పెషల్ డ్రైవ్‌ను పరిశీలించారు. కమిషనర్ వెంట ఆర్ఓ సతీష్, ఆర్ఐలు మురళీ, వేణు, తదితరులు ఉన్నారు.

### కార్తికేయుడికి పంచామృతాభిషేకాలు


ప్రత్యేక అలంకరణలో సర్పరూపుడు

**ఆత్మకూరు:** పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు, పంచామృతాభిషక్తకాలు నిర్వహించారు. ముందుగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయఆవరణలో రాహుకేతు హోమాలు చేశారు. భక్తులు ఆలయం చుట్టూ 108 ప్రదక్షిణలు చేశారు. ఆలయంలో ఉన్న మంజునాథస్వామి, పార్వతిదేవికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు,అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## పుస్తకం.. మంచి నేస్తం!

పుస్తకం..మంచి నేస్తం.. పుస్తకం.. వందమంది స్నేహితులతో సమానం. పుస్తకం.. విజ్ఞాన భాండాగారం. విజ్ఞానాన్ని అందిస్తుంది. పుస్తక పఠనంతో వినోదాన్ని, వికాసాన్ని అందిస్తుంది. ఒంటరితనంలో తోడుంటుంది. మెదడుకు పదును పెడుతుంది.. కోటి మెదళ్లను కదిలిస్తుంది..నిరుత్సాహంలోనూ ఉత్తేజాన్ని ఇస్తుంది. విజయతీరానికి చేరుస్తుంది. ఎలాంటి పుస్తకమైనా అనంతపురం నగరంలో దొరుకుతోంది. ఆదివారం వచ్చిందంటే చాలు.. నగరంలో 'సండే బుక్ బజార్'గా వెలుస్తోంది. పుస్తక ప్రియులు వారికి కావాల్సిన పుస్తకాలు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. సప్తగిరి సర్కిల్, ఆర్ట్స్ కళాశాల రోడ్డు, నగరపాలక సంస్థ కార్యాలయం, కేఎస్ఆర్ కళాశాల, లలిత కళాపరిషత్, సుభాష్‌రోడ్డులో వ్యాపారులు వివిధ రకాల వేలాది పుస్తకాలను బుక్ బజారులో ఉంచుతున్నారు. పెద్దబాల శిక్ష నుంచి పోటీ పరీక్షల పుస్తకాలు, వ్యక్తిత్వ వికాస పుస్తకాలు సగం ధరలకే లభిస్తున్నాయి.

– సాక్షి ఫొటో గ్రాఫర్, అనంతపురం:






## సద్దికూటి వెంకట్రామిరెడ్డి లేని లోటు తీర్చలేనిది


వెంకట్రామిరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

**ఆత్మకూరు:** సద్దికూటి వెంకట్రామిరెడ్డి మరణం తీర్చలేనిదని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. ఆత్మకూరుకు చెందిన టెక్నికల్ అసిస్టెంట్, వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు సద్దికూటి వెంకట్రామిరెడ్డి శనివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయం విదితమే. ఆదివారం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆత్మకూరుకు చేరుకొని సద్దికూటి వెంకట్రామిరెడ్డి మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వెంకట్రామిరెడ్డి భార్య, కొడుకు, కుమార్తెను పరామర్శించి, ధైర్యం చెప్పారు. వెంకట్రామిరెడ్డి మా కుటుంబానికి సన్నిహితంగా ఉండేవాడని, ఆయన లేని లోటు తీర్చలేమని ఎమ్మెల్యే అన్నారు. ఆ కుటుంబానికి తమ వంతు సహాయం అందిస్తామన్నారు. సర్వజనాస్పత్రిలో వెంకట్రామిరెడ్డి మృతదేహానికి వైఎస్సార్‌సీపీ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి, డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, ఉపాధిహామీ సిబ్బంది, అధికారులు వేర్వేరు సమయాల్లో నివాళులర్పించారు. వెంకట్రామిరెడ్డి అందరితోనూ కుటుంబ సభ్యుడిలో కలిసిపోయేవాడని డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ బెడుదూరి గోపాల్‌రెడ్డి, శివారెడ్డి, ధనుంజయయాదవ్, ఆంథోని రెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, బాలపోతన్న, వాసుదేవరెడ్డి, వెంకట్రాముడు, లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు నివాళులర్పించారు.

## కేంద్రానిది ప్రజావ్యతిరేక పాలన

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు


జీపుయాత్రలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

**అనంతపురం అర్బన్:** కేంద్ర ప్రభుత్వానిది ప్రజావ్యతిరేక పాలన అని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు ధ్వజమెత్తారు. ఆదివారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక టవర్ క్లాక్ వద్ద కార్మిక, రైతు జీపుయాత్రను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మోదీ ప్రభుత్వం కార్మికులు, వ్యవసాయ కార్మికులు, రైతులు, కౌలు రైతులు, ప్రజల సమస్యలను మరింత జటిలం చేస్తోందన్నారు. దేశంలోనే అత్యంత ధనవంతులైన ఆదాని, అంబానీ సేవలో మునిగి తేలుతోందని విమర్శించారు. ఏప్రిల్ 5న ఢిల్లీలో నిర్వహించనున్న కార్మిక, కర్షక ప్రదర్శనకు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్, నాయకులు బాలరంగయ్య, శ్రీనివాసులు, వెంకటనారాయణ, నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**అనంతపురం అర్బన్:** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం ఆశయాలు కొనసాగిస్తామని సీపీఎం, ఐద్వా నాయకులు తెలిపారు. ఆదివారం స్థానిక టవర్‌క్లాక్ వద్ద మల్లు స్వరాజ్యం వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సీపీఎం కార్యాలయంలోనూ వేడుకలు నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఓబులు, జిల్లా కార్యదర్శి రాంభూపాల్, డాక్టర్ ప్రసూన, ఐద్వా రాష్ట్ర నాయకురాలు సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

### వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చండి

**కనగానపల్లి:** వెనుకబడి కులాల కింద ఉన్న వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు కృషి చేయాలని రాప్తాడు నియోజకవర్గ వాల్మీకి సంఘం నాయకులు రాష్ట్ర బీసీ ఫెడరేషన్ నాయకుడు జంగా కృష్ణమూర్తికి వినతిపత్రం అందించారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశంపై నిర్వహిస్తున్న బీసీ సదస్సుకు వాల్మీకి సంఘం నాయకులు ఆదివారం తరలివెళ్లారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే అసెంబ్లీలో తీర్మానం చేయించాలని అక్కడి నాయకులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర దృశ్యకళల డైరెక్టర్ ప్రభాకర్, గ్రీనింగ్ అండ్ బ్యూటీషియన్ డైరెక్టర్ రామాంజనేయులు, రాప్తాడు వైస్ ఎంపీపీ రామాంజనేయులు, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ బొగ్గు కృష్ణ పాల్గొన్నారు.

### నేటి నుంచి ఉగాది వేడుకలు

**చెన్నేకొత్తపల్లి:** మండలంలో ప్రసిద్ధిగాంచిన ఒంటికొండ అక్కులమ్మ గారి ఉగాది వేడుకలు సోమవారం ప్రారంభం కానున్నాయి. సోమవారం సాయంత్రం ఎలువగంప ఊరేగింపు, 21న జలధి బుగ్గలోకి తరలివెళ్లడం, 22న పన్నేరపుబండ్ల ఊరేగింపు, 23న కుంకుమలు, పరుస, 24న పోతులరాజుకు గావుల మహోత్సవం జరుగుతుంది.

### నేడు దివ్యాంగుల పిల్లలకు పరీక్షలు

**కనగానపల్లి:** స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగ పిల్లలకు సోమవారం పరీక్షలు చేస్తున్నట్లు ఐఈఆర్టీ ఎంఈఓ అరుణమ్మ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.ప్రభుత్వ ఉపకరణాలు అందించేందుకు చేసే పరీక్షలకు మండలంలోని దివ్యాంగ పిల్లలను భవిత కేంద్రానికి తీసుకొచ్చి పరీక్షలు చేయించాలన్నారు.

## అల్లాకు ప్రీతిపాత్రమైనది మసీదు


మాట్లాడుతున్న మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం, అనంత చంద్రారెడ్డి తదితరులు

**అనంతపురం సప్తగిరి సర్కిల్:** అల్లాకు అత్యంత ప్రీతిపాత్రమైనది మసీదు అని నగర మేయర్ వసీం పేర్కొన్నారు. స్థానిక రెండో డివిజన్‌లోని బిందెల కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన మసీద్‌ఏ కమ్మూరు షాకీర్ హుస్సేన్ ప్రారంభోత్సవానికి మేయర్, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అనంత చంద్రారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ బిందెల కాలనీలో అన్వర్ హుస్సేన్ తన కుమారుడి జ్ఞాపకార్థం ప్రజలకు సౌకర్యార్థం నిర్మించిన ఈ మసీదులో త్వరలోనే మదరసాను ఏర్పాటు చేసి, పేద పిల్లలకు ప్రత్యేక చొరవతో దైవ విద్యను అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇసాక్, రెండో డివిజన్ కన్వీనర్ బోయ రవికుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు బషీర్ అహమ్మద్, ఖాజా, మెహరాజ్, మత పెద్దలు, మౌలానాలు, ఉలేమాలు తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షంతో రైతన్నకు నష్టం


ఎం.చెర్లోపల్లిలో నేలకొరిగిన అరటి పంటను పరిశీలిస్తున్న ఎంపీఈఓ రాజు

**రాప్తాడు:** అకాల వర్షాలతో మండలంలో అరటి రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. ఎం.చెర్లోపల్లిలో దాదాపుగా 12 మంది రైతులకు చెందిన 30 ఎకరాల్లో అరటి పంట నేలకొరిగింది. దాదాపుగా రూ.1 కోటీ 20 లక్షలు నష్టపోయినట్లు బాధితులు తెలిపారు. చిత్రా లక్ష్మీదేవికి చెందిన 6 ఎకరాలు అరటి తోట నేలకొరిగింది. బాధిత రైతుకు రూ. 24 లక్షలు, పెద్ద ఎల్లమ్మ 4 ఎకరాల్లో సాగు చేసిన అరటితోట నేలమట్టమై, రూ.16లక్షలు నష్టపోయింది. రామచంద్రారెడ్డికి చెందిన ఎకరా, బుడగ నారమ్మకు చెందిన ఎకరా, నారాయణ రెడ్డికి చెందిన ఎకరా, నాగేంద్రకు చెందిన ఎకరా, సాంబశివారెడ్డి 3 ఎకరాలు, శంకరయ్య 4 ఎకరాలు, నారాయణ స్వామి 4 ఎకరాలు , మల్లికార్జున 4 ఎకరాలు అరటితో పాటు శేఖర్ అనే రైతుకు చెందిన 4 ఎకరాలు మునగపంట నేలమట్టమైంది. వెంకటరమణారెడ్డికి చెందిన నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న నేలకూలింది. ఎంపీఈఓ రాజు, హార్టికల్చర్ వీహెచ్‌ఏ హర్షవర్ధన్ దెబ్బతిన్న పంటలను పరిశీలించి, రైతులకు పరిహారం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.

**భారీ వర్షానికి దెబ్బతిన్న పండ్ల తోటలు**

**కనగానపల్లి:** మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షానికి పండ్లతోటలు దెబ్బతిన్నాయి. పలుచోట్ల ఇళ్లు కూలిపోయాయి. శనివారం రాత్రి కురిసిన వర్షానికి మామిళ్లపల్లిలో లక్ష్మమ్మ ఇంటి పైకప్పు కూలిపోయింది. ఇంటి సామగ్రి, ధాన్యం పాడవటంతో రూ.20 వేల నష్టపోయినట్లు బాధితురాలు తెలిపింది. పర్వతదేవరపల్లి, కుర్లపల్లి, కనగానపల్లి, యలకుంట్ల గ్రామాల్లోని మామిడి, అరటి తోటలు నేలకొరిగాయి. కోతకు మామిడి పండ్లు నేలరాలాయని రైతులు వన్నూరప్ప, సుబ్రమణ్యం, ముత్యాలప్ప తెలిపారు. రబీలో వేరుశనగ సాగు చేసిన చేసిన రైతులు కూడా పంట తొలగించుకోవాటానికి ఇబ్బందులు పడుతున్నారు.

**గాలీవానతో అపార నష్టం**

**చెన్నేకొత్తపల్లి:** మండల వ్యాప్తంగా శనివారం కురిసిన గాలీవానకు పలు గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఓబుళంపల్లి, న్యామద్దెల, బసంపల్లి, కనుముక్కల, చెన్నేకొత్తపల్లి, వెంకటంపల్లి, కోటంపల్లి, ఆమిదాలకుంట గ్రామాల్లో రైతులు సాగుచేసిన మొక్కజొన్న, అరటి, బీర, వరి పంటలు గాలీవానకు పూర్తిగా నేలకొరిగాయి. మండల వ్యాప్తంగా దాదాపు 200 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. పలుప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, చెట్లు గాలీవానకు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

## ఆకట్టుకున్న శాస్త్రీయ నృత్య పోటీలు

**అనంతపురం కల్చరల్:** చిన్నారుల శాస్త్రీయ నృత్యపోటీలు ఆకట్టుకున్నాయి. స్థానిక గీతామదిరంలో వేదికగా అనంత కళా స్రవంతి ఆధ్వర్యంలో ఉగాది పర్వదినాలను పురస్కరించుకొని శాస్త్రీయ సంగీత, నృత్య పోటీలు నిర్వహించారు. యువనృత్య కళాకారిణి దుర్గ విద్యాధరికి ఉగాది పురస్కారం అందించారు. అనంత కళా స్రవంతి కార్యదర్శి సరిత రవీంద్ర, సంగీత కళానిధి మాధురిరెడ్డి, కూడిపూడి నృత్య కళానిలయం వ్యవస్థాపకులు, నాట్యాచార్య కృష్ణమూర్తిరాజు తదితరులు ఆత్మీయ అతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా బేబీ ఆర్యశ్రీ, ఆధ్యశ్రీ లవకుశ సినిమాలోని పాటలపై నృత్యం చేశారు. నృత్యకారిణి కృత్తిక దీపాలు పట్టుకుని చేసిన శాస్త్రీయ నృత్యం అలరించింది. విజేతలకు సంగీత విద్వాంసులు సంధ్యావందనం రామచంద్రరావు చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందించారు.

### రూ. వెయ్యి కోట్ల టర్నోవర్ లక్ష్యం

**అనంతపురం అగ్రికల్చర్:** మార్చి నుంచి ప్రారంభం కానున్న 2023-24లో ది అనంతపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు (టౌన్ బ్యాంకు) ద్వారా రూ.1,000 కోట్లు టర్నోవర్ లక్ష్యంగా పని చేస్తున్నట్లు బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళి తెలిపారు. ఆదివారం స్థానిక బ్యాంకు కార్యాలయంలో 107వ మహాజనసభ నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ ఖాతాదారులకు పెట్టుబడులకు భరోసా ఇస్తామన్నారు. కులమతాలు, పార్టీలు, వర్గాలకతీతంగా టౌన్‌బ్యాంకు ద్వారా అన్ని వర్గాలకు అవసరమైన రుణాలు మంజూరు చేస్తామన్నారు. మూడు నెలల కాలంలోనే 37 శాతం ఉన్న నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ)ను 8 శాతానికి తగ్గించి బ్యాంకును లాభాలబాట పట్టించామన్నారు. 2024 మార్చి నాటికి రూ.150 కోట్లు డిపాజిట్లు సేకరించడం, అనుకున్న విధంగా టర్నోవర్ చేరుకునేలా పని చేస్తామన్నారు. మహాజనసభలో ఉపాధ్యక్షులు కృష్ణకుమార్, రమణయ్య, డైరెక్టర్లు సుంకర రమేష్, వెంకటాద్రి, సుబ్రమణ్యం, భాస్కర్, చంద్రశేఖర్, రాధా, బ్యాంకు సీఈవో విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### వీర మంగళకు డాక్టరేట్



**అనంతపురం:** శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఎంబీఏ విభాగంలో పరిశోధన చేసిన ఎస్. వీరమంగళకు డాక్టరేట్ ప్రదానం చేశారు.ఈమె ప్రొఫెసర్ బి.అనిత పర్యవేక్షణలో ' ఇంపాక్ట్ ఆఫ్ ప్యాకింగ్ ఆన్ బిల్డింగ్ ఆబ్రాండ్ ఇమేజ్- యాన్ ఇంపిరికల్ స్టడీ ఆఫ్ ఎఫ్ఎంసీజీ ఇన్ సెలెక్టెడ్ సిటీస్ ఆఫ్ కర్ణాటక' అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ అంశంపై పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌ను ప్రచురించారు.

### సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

**రాప్తాడు:** సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ డాక్టర్ శివకృష్ణ సూచించారు.ఆదివారం స్థానిక పీహెచ్‌సీలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మలేరియా, డెంగీ, చికున్ గున్యా తదితర ప్రమాదకర వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించేలా సిబ్బందికి సూచనలు చేశామన్నారు. ఇళ్ల పరిసర ప్రాంతాల్లో చెత్తాచెదారం తొలగించుకోవాలన్నారు.

**తక్షణ వైద్య సేవలు**

పీహెచ్‌సీ పరిధిలో సీజనల్ ఫీవర్‌తో బాధపడుతున్న వారిని గుర్తించి, వారికి తక్షణ వైద్యసేవలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని డాక్టర్ శివకృష్ణ తెలిపారు. గ్రామాల్లో కాలువల్లో దోమలు వృద్ధి చెందకుండా దోమల మందు పిచికారీ చేయాలని అధికారులకు సూచించామన్నారు. చెత్తాచెదారంతో నిండిన కాలువలను గుర్తించి పారిశుధ్య సిబ్బందితో శుభ్రం చేయించాలన్నారు.

### రేషన్ బియ్యం స్వాధీనం

**అనంతపురం శ్రీకంఠంసర్కిల్:** జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఏక కాలంలో విజిలెన్స్ అధికారులు చేపట్టిన తనిఖీల్లో పెద్ద ఎత్తున రేషన్ బియ్యం పట్టుబడింది. విజిలెన్స్ డీఎస్పీ వీరరాఘవరెడ్డి తెలిపిన మేరకు.. ఈ నెల 17న ఆత్మకూరు మండలం సింగన్నగుట్ట వద్ద చేపట్టిన తనిఖీల్లో 36 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతపురంలోని ముత్యాలమ్మ కాలనీ నివాసి ఎరికల రత్నమ్మ... కార్డుదారుల నుంచి బియ్యాన్ని సేకరించి కర్ణాటకలోని పావగడకు తరలిస్తున్నట్లుగా విచారణలో వెలుగు చూసింది. వాహనాన్ని సీజ్ చేసి, రత్నమ్మతో పాటు వాహన యజమాని ప్రకాశం జిల్లా లింగసముద్రం గ్రామానికి చెందిన తమ్మిశెట్టి వెంకన్న, డ్రైవర్‌ని అరెస్ట్ చేశారు.

- ఆకుతోటపల్లిలోని రాజీవ్‌గాంధీకాలనీకి చెందిన కెలుత్ శంకర్‌నాయక్ ఆటోలో 'మదర్ ఇండియా బ్రాండ్ రైస్' అని ముద్రించిన 25 కిలోల ప్లాస్టిక్ సంచుల్లో పది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తూ ఆత్మకూరు మండలం పి.యాలేరు క్రాస్ వద్ద పట్టుబడ్డాడు. వాహనాన్ని సీజ్ చేసి, శంకర్‌నాయక్‌తో పాటు ఆటో డ్రైవర్ ప్రసాద్ నాయక్‌ని అరెస్ట్ చేశారు.

## త్యాగానికి ప్రతీక 'ముసలమ్మ'

- రేపు ముసలమ్మ ఆలయ తృతీయ వార్షికోత్సవం

**బుక్కరాయసముద్రం:** మండల కేంద్రంలోని తాడిపత్రి రహదారి పక్కన చెరువు కట్ట సమీపంలో వెలసిన ముసలమ్మ కట్ట త్యాగానికి ప్రతీకగా నిలుస్తోంది. నిత్యం పూజలందుకుంటూ ప్రజల ఆరాధ్యదైవంగా విరాజిల్లుతోంది. పూర్వీకుల కథనం మేరకు..మండల కేంద్రంలో ఉన్న చెరువు సుమారు 300 ఏళ్ల క్రితం చెరువు నిండి ఉప్పొంగి ప్రవహించడంతో కట్ట తెగిపోయింది. వర్షపు నీరు ఊరును ముంచెత్తుతుందని అందరూ భయాందోళనకు గురయ్యారు. ఈక్రమంలో ప్రజలంతా గ్రామ సమీపంలో ఉన్న పోలేరమ్మను ప్రార్థించారు. చెరువు కట్ట సమీపంలో ఒక పెద్ద శబ్దంతో మాటలు వినిపించాయి. గ్రామంలో ఉన్న బసిరెడ్డి చిన్న కోడలు ముసలమ్మను చెరువుకట్టకు బలిస్తే ఈ తెగిన చెరువుకట్ట నిలుస్తుందని మాటల సారాంశం. ఈ విషయాన్ని గ్రామస్తులు బసిరెడ్డి కుటుంబం వద్దకు వెళ్లి తెలియజేశారు. ఈ విషయం విన్న ముసలమ్మ ప్రాణత్యాగానికి సిద్ధపడింది. అత్తమామల అనుమతి తీసుకుంది. దేవుని ప్రార్థించి ముసలమ్మ కట్ట సమీపంలో ఉన్న చెరువులోకి దూకింది. దీంతో వరదనీరు శాంతించి నిలిచిపోయింది. వెంటనే ప్రజలు ఆమెకు గుర్తుగా ముసలమ్మ కట్ట పేరుతో నిర్మాణం చేపట్టి నిత్యం పూజలు నిర్వహిస్తున్నారు.

**ఘనంగా పూజలు..**

చెరువు కట్ట సమీపంలో ఉన్న ముసలమ్మ ఆలయాన్ని మూడేళ్ల క్రితం ఆ వంశస్తులు అయిన సూర్యనారాయణరెడ్డి, సుశీలమ్మ కొత్తగా నిర్మించారు. దీంతో ఏటా ఆలయ వార్షికోత్సవం నిర్వహిస్తున్నారు. తృతీయ వార్షికోత్సవంలో భాగంగా 21న ఆలయంలో ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు మూల దేవత ప్రార్థన, గురు ప్రార్థన, గణపతి పూజ, స్వస్తి వచనము, రక్షా బంధనం నిర్వహించనున్నారు. 22న ఉదయం 6 గంటకు అమ్మవారికి అభిషేకం, కలశ స్థాపన, గణపతి హోమం, పంచామృతాభిషేకం, కలశ స్థాపన ఆదిత్యా నవగ్రహ హోమం, ముసలమ్మ అమ్మవారి మూల మంత్ర హోమం, ఉదయం 10 గంటలకు మహా పూర్ణాహుతి, మధ్యాహ్నం 12గంటలకు మహా మంగళ హారతి ఇచ్చారు.



ముసలమ్మతల్లి దేవాలయం

**22న చిక్కవడియార్ చెరువులో తెప్పోత్సవం**

బీకేఎస్‌లోని చిక్కవడియార్ చెరువులో ఈనెల 22న సాయంత్రం 5 గంటలకు ముసలమ్మ దేవత తెప్పోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త సుశీలమ్మ తెలిపారు. ఏటా అమ్మవారితో కలసి చిక్కవడియార్ చెరువులో తెప్పోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. దేవాలయ ప్రాంగణంలో భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.


ముసలమ్మ మూలవిరాట్

### ఎస్సీలకు అన్యాయం చేసే జీవోలు రద్దు చేయాలి

**అనంతపురం టవర్‌క్లాక్:** ఎస్సీ జాబితాలోకి ఇతర కులాలను చేర్చే జీవోలు 52, 53, 77లను రద్దు చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకటరావు కోరారు. ఆదివారం స్థానిక లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో దళిత సంఘాల నాయకులతో రౌండు టేబుల్ సమావేశం నిర్వహించారు. మల్లెల వెంకటరావు మాట్లాడుతూ దళితులు ఐక్యంగా ముందుకు వచ్చి ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు బీసీఆర్ దాస్, సాకే హరి, ఓబులేసు, రామచంద్ర, రామన్న, యల్లన్న, ఉమామహేశ్వరి, తిరుపాలు, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.